# మసకతెర

ఇంటిముందు చక్కని పారిజాతపు చెట్టు. తెల్లవారే సరికి, గుమ్మంలో మంచు ముత్యాలతో మెరుస్తూ ఉంటాయి ఎన్నో పువ్వులు ఒకదానిమీద ఒకటి ఒత్తిగిల్లి పగడపు గొట్టాలలోంచి ఆకాశాన్ని చూస్తూ, ఏవో కలలు కంటున్నట్లుంటాయి.

ఆ ఇంట్లో ఆ పువ్వులను చూసి మురిసిపొయ్యేది రామారావు ఒక్కడే.

అతని భార్య కామమ్మకు ఆ పువ్వులమీద మోజు లేదు.

రోజూ వాదనే ఇద్దరికీ.

'ఎండ వచ్చేసరికి వాడిపోతాయి.'

అల్పాయుష్షు జీవులు.

ఈ క్షణిక సౌందర్యం ఎవరిని తృప్తిపరుస్తుంది ?

రామారావు వాదన వేరు:

'నూరు సంవత్సరాలు జీవిస్తేమటుకు ఆ జీవితం సార్థకమైనట్లు రుజువేమిటి? ఒక్క క్షణం, పరిపూర్ణమైన ఆనం దాన్ని అనుభవించినా, ఆ అనుభూతి ఇంకొకరిలో కలిగింప గలిగినా, ఆ జీవితమూ, ఆ సౌందర్యమూ ఫలించినట్లే. ఆ క్షణం జన్మ జన్మాలకూ మరపురానిది!'

కామమ్మ ఊరుకోదు.

'ఈ పువ్వులవలన ఏమిటి ఆనందం ? చుట్టూ గొంగళీ పురుగులు. ఆ బాధ భరించలేం.'

'నిజమే ! సుఖాన్ని అంటి పెట్టుకొని ఎప్పుడూ దుఃఖం ఉండనే వుంటుంది. అయితే బాధ కలుగుతుందని భయపడి' ఒక్క క్షణమైనా లభ్యమయ్యే సుఖాన్ని దూరం చేసుకోవాలా?

*    *    *

తీరికగా ఆలోచిస్తే, జీవితం చిత్రంగా వుంటుంది. సుఖ దుఃఖాలలో ఏది విలువ కలదో చెప్పలేము. జీవిత పరమార్థ మేమిటో తెలిసికోలేము. అదృష్టవశాత్తు—జీవితాన్ని గురించి ఆలోచించడానికి తీరికే లేదు. జీవిస్తూ, ఆ జీవితపు సందడిలో, జీవితాన్ని గురించి ఆలోచించము. ఎప్పుడూ ఏదో అన్వేషణ, తీరని ఆతృత. ఈర్ష్యా, కోపమూ, అసంతృప్తి, జాలి, భయమూ, తృష్ణ, ఇల్లాంటివి ఏవేవో మనస్సును చికాకు పరుస్తూనే వుంటాయి.

విశ్రాంతి లేదు.

ఆనందం కోసం వెతుక్కుంటూ, ఆనందాన్ని పారవేసుకుంటాము.

ఎప్పుడో, జీవితపు విలువలను తెలుసుకోకుండానే, ఈ జీవితము ముగిస్తుందని స్ఫురించదు.

*    *    *

కాని, ఎప్పుడో ఒక్కసారి మాత్రం మసకతెర విడిపోతుంది. జన్మాంతర సంస్కారము ఒక్కసారి వికసిస్తుంది. దృక్పథం మారిపోతుంది. అనుకోకుండా, మృత్యుముఖం ఎదురౌతుంది—భూమి బ్రద్దలై, బ్రహ్మాండమైన లోయ ఎదురైనట్లు.

అప్పుడు మణులు వజ్రాలు అనుకొని మనం కోరి పరిత పించినవన్నీ రంగుపూసలు, చిల్లపెంకులుగా మారిపోతాయి.

*　　　*　　　*

రామారావులో ఈ మార్పు సరీగా, ఏ నిమిషాన కలిగిందో అతను చెప్పలేడు. తీవ్రమైన జ్వరంతో బాధపడు తున్నాడు. ఆవేళ డాక్టరు వుత్సాహంగావున్నా, అతనికి వుత్సాహం కలుగలేదు. ఏదో గాఢమైన నిశ్శబ్దం ఆవరిం చుకు వస్తున్నట్లుంది. అతను అనుకున్నాడు చివరిఘడియ సమీపించినదని.

ఆ తరువాత మూడు రోజులవరకూ తను ఏ లోకంలో వున్నదీ అతనికే తెలియలేదు. మగత కళ్ళతో గదిఅంతా కలయజూచేవాడు ఎన్నాళ్ళనుంచో ఆ గదికి అతను అల వాటుపడిపోయినాడు. చూడకుండానే ఏ వస్తువు ఎక్కడ వున్నదీ తెలుసు.

ఆ రోజు మాత్రం: ఆగదీ, ఆ వస్తువులూ, ఆ వాతా వరణమూ అంతా ఏదో కలలా తోచాయి.

అతని హృదయం ఎక్కడో, ఎన్నడూ ఎరుగని పచ్చిక బయళ్ళలో, సెలయేటి తీరాల్లో,ఇసుకతిన్నెల్లో విహరిస్తోంది.

కామమ్మకు అతని పరిస్థితి అర్థముకాలేదు. అయినా, తనకు తెలియకుండానే అతనిని తిరిగీ మామూలు ప్రపంచం లోకి తీసుకురావటానికి విశ్వప్రయత్నం చేసింది.

ఒక్క నిమిషం ఊరుకోలేదు.

'మందు పుచ్చుకోరూ?'

'నిద్రవస్తోందా?'

'జావతాగుతారా, లేకపోతే కాఫీ కాచనా?'

—మూడు రోజులు అతనితో పెనుగులాడింది.

మూడో రోజు జ్వరం తగ్గింది.

అతను ఆమె ప్రశ్నలకు జవాబు చెప్పాడు.

కాని, అతని ఊహాలుమాత్రం మారిపోయినవి.

ఎప్పటికైనా, చివరకు, అగాధమైన నిశ్శబ్దమే మిగులుతుందని, అతను మరువలేడు.

ఈ నిమిషాన పిడుగుపడవచ్చు; ఈ నిమిషంలో భూకంపం రావచ్చు. ఒక్క క్షణంలో తను చిన్నప్పటినుంచీ కట్టుకున్న గాలిమేడలన్నీ కూలిపోవచ్చు.

ఎంత అర్థంలేని బ్రతుకు!

అతనికి శాంతి కుదరలేదు......

చాలా రోజులకు భార్యతో అన్నాడు:

'ఒకవేళ నేను చచ్చిపోయివుంటే'—

మాట పూర్తి కాకుండానే, కామమ్మ మందలించింది.

'ఛీ! ఊరుకోండి. నిండు ఇంట్లో ఏమిటా మాటలు!'

అతను మళ్ళీ ఆ మాట ఎత్తలేదు.

అవును; ఆ విషయం మరచిపోవడమే మంచిది!

లేకపోతే జీవించటమే కష్టం!

అతనుమాత్రం ఆ తరువాత ఎప్పుడూ, ఎంత ప్రియమైన వస్తువైనా, అమూల్యమైనదని కానీ, ఎంత అల్పవస్తువైనా విలువలేదనికానీ, అనుకోలేకపొయ్యేవాడు. గుమ్మంలో గొంగళీపురుగుకు ఎంత స్థానమో పారిజాత పూవులకూ అంతేనేమో!